పగలే వెన్నెల

విద్యుత్‌ విలువైనదని, దానిని వృథా చేయకుండా కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఓ పక్క ప్రభుత్వాలు చెబుతున్న ప్పటికీ.. విద్యుత్‌ శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరి కొన్ని చోట్ల స్పష్టంగా కనిపిస్తోంది. ప్రధాన మంత్రి సూర్యఘర్‌ యోజనా అంటూ విద్యుత్‌ వాడకం తగ్గించుకోవాలని, ఆదా చేయాలని విస్తృతంగా ప్రచారాలు చేస్తూనే.. విద్యుత్‌ ఆదాలో ఆ శాఖే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పలు వార్డుల్లో వీధిలైట్ల నిర్వహణే ఇందుకు ఉదాహరణ.

– మద్రిపాలెం


అంబేడ్కర్‌ కాలనీ రోడ్డులో ఉదయం వేళ వరుసగా వెలిగి ఉన్న వీధిలైట్లు


కళింగనగర్‌లో మధ్యాహ్నం వెలుగుతున్న హైమాస్క్‌ లైట్లు

- 51వ వార్డులో పలుచోట్ల పగలు వెలుగుతున్న వీధిలైట్లు
- నిర్వహణను గాలికొదిలేసిన శాఖాధికారులు
- విద్యుత్‌ వృథాపై మండిపడుతున్న స్థానికులు

జీవీఎంసీ 51వ వార్డులోని పలు ప్రాంతాల్లో పగటి పూట వీధిలైట్లు వెలిగి ఉంటూ వెన్నెలను తలపిస్తున్నాయి. ఉదయం 8 గంటలైనా.. మిట్ట మధ్యాహ్నం 12 గంటలైనా.. ఎక్కడో ఓ చోట విద్యుత్‌ లైట్లు వెలుగుతూనే కనిపిస్తున్నాయి. ఆర్‌ అండ్‌ బీ జంక్షన్‌ నుంచి అంబేడ్కర్‌ కాలనీ రోడ్డంతా వరుసగా అన్ని వీధి దీపాలు వెలుగుతున్నాయి. ముఖ్యంగా కళింగనగర్‌ ప్రాంతంలో దాదాపు అన్ని చోట్ల కొద్ది రోజుల నుంచి ఉదయం రాత్రి అనే తేడా లేకుండా వీధిలైట్లు, హైమాస్క్‌ లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. తమ ఇళ్ల ముందు నిత్యం వీధిలైట్లు వెలుగుతూ ఉంటున్నాయని పలువురు స్థానికులు చెబుతున్నారు. విద్యుత్‌ ఆదా చేయండని అధికారులు చెబుతూనే.. వీధిలైట్ల నిర్వహణను గాలికొదిలేసి వృథా చేస్తున్నారని కొందరు మండిపడుతున్నారు. వార్డులో వీధిలైట్ల సమస్యపై ఎన్నిసార్లు చెప్పినా అధికారులు స్పందించడం లేదంటున్నారు.

ఆదా కాదు.. వృథా

ఉదయం వేళల్లో విద్యుత్‌ లైట్లు వెలిగి ఉండటంతో ప్రజాధనం ఎంత వృథా అవుతోందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఓ పక్క ఇంధన పొదుపు చేయాలని అధికారులు ప్రచారాలు చేస్తూనే.. మరోపక్క విద్యుత్‌ ఆదాపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పలువురు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


కళింగనగర్‌ కాలనీలో వీధిలైటు వెలుగులు

విద్యుత్‌ పొదుపును అలవాటుగా మార్చుకోవాలని అంటున్నారే కానీ దానిని అమలు చేయడంలో ఆ శాఖ విఫలమవుతోందని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కావాల్సిన సమయంలో విద్యుత్‌ లైట్లు పనిచేయవని, ఉదయం వేళల్లో వీధిలైట్లు వెలుగుతుంటే అధికారులు ఎందుకని పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. రాత్రి సమయంలో ఎక్కడెక్కడ లైట్లు వెలగడం లేదో సిబ్బంది దృష్టి పెడితే ఆ ప్రాంతంలో అంధకారం ఉండదని, అలా కాకుండా ఉదయమంతా ఆపకుండా వదిలేయంలో అర్థం లేదంటున్నారు. విద్యుత్‌ శాఖాధికారులు మేల్కొని వీధిలైట్ల నిర్వహణను సక్రమంగా చేపట్టాలని 51వ వార్డు ప్రజలు కోరుతున్నారు.


కళింగనగర్‌లోని ఓ రోడ్డులో వరుసగా వెలుగుతున్న విద్యుత్‌ లైట్లు

విశాఖ రైల్వే స్టేషన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు


రైల్వే స్టేషన్‌లో అధికారులతో కలిసి పర్యటిస్తున్న డీఆర్‌ఎం లలిత్‌ బోహ్రా

తాటిచెట్లపాలెం: డివిజనల్‌ రైల్వే మేనేజర్‌ లలిత్‌ బొహ్రా ఇతర ఉన్నతాధికారులతో కలిసి గురువారం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో పర్యటించారు. రుసుము చెల్లించి వాడుకునే మరుగుదొడ్లు, పార్కింగ్‌ ప్రదేశాలు, వెయిటింగ్‌ హాల్స్‌, పాదచారుల వంతెనలు, లిఫ్టులు, వాటర్‌ బూత్‌లు, కేటరింగ్‌ స్టాళ్లు, ప్లాట్‌ఫారాలు, పార్సిల్‌ కార్యాలయాలను డీఆర్‌ఎం తనిఖీ చేశారు. ప్రయాణికుల సౌకర్యాలను స్వయంగా పరిశీలించారు. రైల్వే స్టేషన్‌ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించి, అధికారులకు సూచనలిచ్చారు.

25.2 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గురువారం నిర్వహించిన తనిఖీల్లో 25.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్‌ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్‌ సిహెచ్‌.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది, ఆర్పీఎఫ్‌ ఎస్‌ఐ దినేష్‌కుమార్‌ దాస్‌లు స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు చేశారు. మహారాష్ట్ర థానే జిల్లాకు చెందిన మొహ్మద్‌ ఉమర్‌ మున్నావర్‌ షేక్‌, ఒడిషా గజపతి జిల్లాకు చెందిన శక్తి మాస్‌ జేనా, సీను రైతాలు విశాఖ రైల్వేస్టేషన్‌ మీదుగా ముంబైకు గంజాయిని అక్రమంగా తరలించడాన్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.1.26 లక్షల విలువైన 25.2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌ నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు.

క్లుప్తంగా

పాఠశాలల విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు


మధురానగర్‌ హైస్కూల్‌లో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు చేస్తున్న సురేష్‌

సీతంపేట: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్‌ డాక్టర్‌ మీనాక్షి ఆధ్వర్యంలో గురువారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా మధురానగర్‌లోని జీవీఎంసీ హైస్కూల్‌లో 400 మంది విద్యార్థులకు పారామెడికల్‌ ఆప్తాల్మిక్‌ ఆఫీసర్‌ ఆర్‌.సురేష్‌ కంటి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 40 మందికి దృష్టిలోపం ఉన్నట్టు గుర్తించారు. వీరికి ప్రభుత్వం ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేస్తుందన్నారు. జిల్లాలోని 595 పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న ఆప్తాల్మిక్‌ ఆఫీసర్లు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, దృష్టిలోపం ఉన్న వారికి కళ్లద్దాలు పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం అక్టోబర్‌ నెలాఖరు వరకు జరుగుతుందన్నారు.

ఏపీటీఎఫ్‌ సీతమ్మధార మండల నూతన కార్యవర్గం


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

సీతంపేట: ఏపీటీఎఫ్‌ సీతమ్మధార మండల శాఖ కార్యవర్గ సాధారణ సమావేశం గురువారం అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్‌ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్‌లో జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా బి.దుర్గాకుమారి, ప్రధాన కార్యదర్శిగా బలిరెడ్డి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా కోరాడ సతీష్‌కుమార్‌, జి.చలపతిరావు, కె.పుష్పలత, కార్యదర్శులుగా కర్రి సత్యనారాయణ, కె.జయవర్ధన్‌, ఎం.సుజాత, కె.అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీటీఎఫ్‌ విశాఖ జిల్లా అధ్యక్షుడు సిహెచ్‌.కరుణాకర్‌ ఎన్నికల అధికారిగా, విజయశ్రీ ఎన్నికల పరిశీలకులుగా నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

ద్విచక్ర వాహనాల తనిఖీ

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో గురువారం ట్రాఫిక్‌ పోలీసులు స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించారు. ఆర్‌ అండ్‌ బీ జంక్షన్‌ వద్ద ట్రాఫిక్‌ ఎస్‌ఐ శ్రీనివాసరావు ద్విచక్ర వాహనదారుల వద్ద పత్రాలు పరిశీలించారు. హెల్మెట్‌ ధరించని వారికి కౌన్సెలింగ్‌ నిర్వహించారు. కార్లలో ప్రయాణించే వారు సీట్‌ బెల్ట్‌ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు. వాహన చోదకులు సురక్షితంగా ఇళ్లకు చేరుకోవాలని సూచించారు.

లలితా పీఠంలో ప్రత్యంగిరా భద్రకాళి హోమం

సీతంపేట: లలితానగర్‌ లలితా పీఠంలో అమావాస్య సందర్భంగా ఆదిపరాశక్తి అనుగ్రహం పొందేందుకు గురువారం శ్రీప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామి అనుగ్రహంతో పండితుల వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా హోమం జరిపారు. స్థానిక భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసారు. ఈ సందర్భంగా పీఠం మేనేజర్‌ మన్నవ కృష్ణసేన్‌ మాట్లాడుతూ భక్తుల కోరిక మేరకు లలితా పీఠంలో ప్రతి అమావాస్య రోజూ ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా కరుభుక్త పద్మ

తాటిచెట్లపాలెం: బీజేపీ విశాఖ జిల్లా కార్యదర్శిగా అక్కయ్యపాలేనికి చెందిన కరుభుక్త పద్మ నియమితులయ్యారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎం.ఎస్‌.పరశురామరాజు చేతుల మీదుగా గురువారం పార్టీ కార్యాలయంలో ఆమె నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈమె విశాఖ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిగా, ఓబీసీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్‌ కమిటీ మెంబర్‌గా సేవలందించారు. ఈ పదవిలో తనను నియమించడంలో సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్‌.మాధవ్‌, ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, పార్టీ నాయకులు సురేష్‌బాబు, శ్యామలదీపిక, ఎం.రవీంద్ర తదితరులకు పద్మ కృతజ్ఞతలు తెలియజేశారు.

శ్రావణం.. శుభకరం

- నేటి నుంచి శ్రావణ మాస పూజలు
- ముస్తాబైన అమ్మవారి ఆలయాలు


లలితా పీఠంలో కొలువైన అమ్మవారు


సీతంపేట పార్వతీశ్వర ఆలయంలో పార్వతీదేవి

సీతంపేట: శ్రావణ మాసం శుక్రవారం నుంచి ప్రారంభం కానుండటంతో అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. సిరులు ప్రసాదించే లక్ష్మీదేవి కటాక్షం కోసం నెల రోజుల పాటు విశేష పూజా కార్యక్రమాలకు ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో అమ్మవారికి శ్రావణ మాసంలో వచ్చే 5 శుక్రవారాలు, 4 మంగళవారాలు, పౌర్ణమి రోజున కుంకుమ పూజలు, సహస్ర నామార్చన, ఖడ్గమాల, త్రిశతి, అష్టోత్తర పూజలు నిర్వహించనున్నారు. ప్రతి శుక్రవారం ఉదయం, పౌర్ణమి రోజున ఉదయం 5 గంటలకు విశేష అభిషేకం జరుగుతుందని పీఠం మేనేజర్‌ మన్నవ కృష్ణసేన్‌ తెలిపారు. కుంకుమ పూజలు, విశేష అభిషేకాల్లో పాల్గొన దలచిన భక్తులు లలితా పీఠం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పార్వతీశ్వరాలయంలో కుంకుమ పూజలు

సీతంపేట గణేష్‌నగర్‌లోని పార్వతీశ్వరాలయంలో పార్వతీదేవి అమ్మవారికి శ్రావణ మాసంలోని మంగళ, శుక్రవారాల్లో కుంకుమ పూజలు జరుగుతాయని అర్చకుడు భాస్కరశర్మ తెలిపారు. నాలుగో శుక్రవారం అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. శ్రావణ మాస పూజలకు ఆలయాన్ని విశేషంగా ముస్తాబు చేసినట్లు చెప్పారు.

‘తెలుగు దిగ్దర్శనం’ గ్రంథావిష్కరణ


గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య నాగేశ్వరరావు

సీతంపేట: భారతీయ విద్యా కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్‌ బీవీకే కళాశాలలో డాక్టర్‌ తూమాటి సంజీవరావు సంపాదకత్వంలో ప్రచురించిన విశిష్ట తెలుగు దిగ్దర్శనం గ్రంథావిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథి ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య గొల్లపల్లి నాగేశ్వరరావు గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూమాటి సంజీవరావు తెలుగు భాష ప్రాచీన ప్రతిపత్తి కోసం ఒంటరి న్యాయ పోరాటం చేసి సాధించారని ప్రశంసించారు. సంజీవరావును ఘనంగా సన్మానించారు. సభకు అధ్యక్షత వహించిన బీవీకే కళాశాల కరస్పాండెంట్‌ ఆచార్య విశ్వనాథ్‌ మాట్లాడుతూ విద్యార్థులు మాతృభాషపై మమకారం పెంచుకోవాలని, తెలుగులో రాయడం, పద్యాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. గ్రంథ సమీక్ష చేసిన డాక్టర్‌ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ తెలుగు భాష పుట్టుపూర్వోత్తరాలు, క్రమ పరిణామం, సాహిత్య వికాసం, ప్రాచీన ప్రతిపత్తి కోసం సంజీవరావు చేసిన పోరాటం మొదలైన అంశాలపై 25 మంది భాషా సాహితీవేత్తలు రచించిన వ్యాసాలను సంకలనంగా రూపొందించి తెలుగువారికి అమూల్యమైన గ్రంథాన్ని అందించారని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్‌ రత్నశేఖర్‌, తెలుగు అధ్యాపకులు మోహనరావు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనలో భాగం కండి


రోగికి మాత్రలు అందిస్తున్న యూపీహెచ్‌సీ వైద్యాధికారి అనూష

మద్రిపాలెం: ప్రధాన మంత్రి టీబీ ముక్త్‌ భారత్‌ అభియాన్‌లో ప్రతి ఒక్కరూ భాగం కావాలని స్థానిక యూపీహెచ్‌సీ వైద్యాధికారి, సిబ్బంది పిలుపునిచ్చారు. 53వ వార్డు జాకీర్‌ హుస్సేన్‌నగర్‌ వద్ద గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్‌ సాసుబిల్లి అనూష మాట్లాడుతూ క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించే దిశగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. టీబీ కేసుల గుర్తింపును వేగవంతం చేయడం, మరణాలను తగ్గించడంతోపాటు కొత్త కేసులను నిరోధించడంలో భాగంగా 60 ఏళ్లు దాటిన వారికి బీఎంఐ, 18 ఏళ్ల లోపు వారికి, సుగర్‌ వ్యాధిగ్రస్తులకు, ధూమ, మద్యపానాలు చేసే వారికి కళ్ల పరీక్షలు నిర్వహించి, ఎక్స్‌రే తీసి వ్యాధి నిర్ధారణ చేస్తామన్నారు. రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం, బరువు, ఆకలి తగ్గడం, ఉమ్మిలో రక్తం పడటం వంటి లక్షణాలుంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. క్షయ వ్యాధి ఉన్నవారు ప్రభుత్వం ఉచితంగా అందించే మందులను ఆశా వర్కర్‌ పర్యవేక్షణలో వాడాలన్నారు. అనంతరం టీబీ రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు మాజీ కార్పొరేటర్‌ నర్సకుమారి, ల్యాబ్‌ టెక్నీషియన్‌ మధు, సూపర్‌వైజర్‌ సూర్యనారాయణ, మణి, ఏఎన్‌ఎం అరుణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో విద్యుత్‌ చార్జీల మోత


కంచరపాలెం కూడలిలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

కంచరపాలెం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్‌ చార్జీలు పెంచడానికి, స్మార్ట్‌ మీటర్లు బిగించడానికి చేసుకున్న ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్‌ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో గురువారం కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్‌ వంతెన కూడలిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్‌ మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్‌ చార్జీలు పెంచి ప్రజలు నడ్డివిరిచారని, స్మార్ట్‌ మీటర్లు ఏర్పాటు చేయడానికి వస్తే ప్రజలు వాటిని పగలగొట్టాలని పిలుపునిచ్చిన చంద్రబాబు, లోకేష్‌లు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో నాలుగు సార్లు విద్యుత్‌ చార్జీలు పెంచి రూ.15.48 కోట్లు భారాన్ని రాష్ట్ర ప్రజలపై మోపారని తెలిపారు. పెంచిన విద్యుత్‌ చార్జీలను తక్షణం రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నెయ్యల నాగభూషణరావు, వాసుపల్లి మల్లయ్య, నెలివాడ అప్పన్న, ఆదారి ఆదినారాయణ, సత్యవతమ్మ, నూకాలమ్మ, అప్పలకొండ, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలను మోసగించడం మహాపాపం

- ఆంధ్రాను అమ్మేయాలని అచ్చెన్నాయుడు అనడం చేతకానితనం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు ధ్వజం
- 43, 51 వార్డుల్లో ‘బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ’


43వ వార్డులో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కె.కె.రాజు, పార్టీ నాయకులు

సీతంపేట: ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ సూపర్‌ సిక్స్‌ పేరిట ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ప్రజల తరఫున పోరాడుతామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు తెలిపారు. పార్టీ 43వ వార్డు నాయకులు దుప్పలపూడి శ్రీనివాస్‌, జక్కంపూడి సత్తిబాబు, ఆదారి పొరుపల్లి రవి ఆధ్వర్యంలో గురువారం అక్కయ్యపాలెం 80 ఫీట్‌ రోడ్‌లోని వేదిక ఫంక్షన్‌ హాల్‌లో జరిగిన ‘బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ’ సభలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. ఓట్లు, సీట్ల కోసం అమలు కాని హామీలిచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. ఆడబిడ్డ నిధి ఇస్తే ఆంధ్రాను అమ్మేయాలని టీడీపీ మంత్రి అచ్చెన్నాయుడు అనడం వారి చేతకానితనానికి నిదర్శనమని, ఎన్నికల ముందు తెలియదా ఆంధ్రాను అమ్మేయాలని ప్రశ్నించారు. ఆడపిల్లకు మాట ఇచ్చి మోసం చేస్తే అది మహాపాపమని కూటమి నాయకులు గుర్తుపెట్టుకోవాలన్నారు. కూటమి మోసాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లడమే బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమ లక్ష్యమన్నారు.

కూటమి పాలనలో అన్నీ మోసాలే..

ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి 30 వరకు సంక్షేమ పథకాలు అమలు చేసి మహిళల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా రూ.2.70 లక్షల కోట్లు ఆర్థిక సాయం జమ చేశారని కె.కె.రాజు గుర్తుచేశారు. అంతకంటే నాలుగు రెట్లు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్‌ కల్యాణ్‌ సంతకాలు చేసి ఇంటింటికీ బాండ్లు పంచిపెట్టి నమ్మించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఒక్క పథకం అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం దారుణమన్నారు. ఎన్నికల హామీల వైఫల్యాలపై వైఎస్సార్‌సీపీ చేపట్టిన వెన్నుపోటు కార్యక్రమంతో కూటమి ప్రభుత్వం దిగొచ్చి తల్లికి వందనం అమలు చేసిందని, యువత పోరుతో విద్యా దీవెన అమలు చేశారని, బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంతో ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు అమలు చేస్తామని ప్రకటించారన్నారు. మాజీ సీఎం వైఎస్‌ జగన్‌ ప్రజలకు కార్పొరేట్‌ స్థాయి, విద్య, వైద్యం అందించారని, కూటమి ప్రభుత్వం వచ్చాక ఆరోగ్యశ్రీలో వైద్యం చేయించుకునే పరిస్థితి లేదన్నారు. అర్హత ఉండి పథకాలు రానివారు తమ దృష్టికి తీసుకొస్తే ప్రజల తరఫున వైఎస్సార్‌సీపీ పోరాడుతుందని కె.కె.రాజు తెలిపారు. అనంతరం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కరపత్రాలను ఆవిష్కరించి ప్రజలకు అందజేశారు. జీవీఎంసీ ఫ్లోర్‌ లీడర్‌ బానాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో అన్ని పథకాలు అందిస్తామని కూటమి నాయకులు సంతకాలు చేసి బాండ్లు ఇచ్చారని, వాటిని ఎందుకు అమలు చేయలేదని మీ ప్రాంత కూటమి నాయకులను ప్రజలు ప్రశ్నించి నిలదీయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 43వ వార్డు నాయకులు కన్నప్పడు, రాజగిరి సింహాచలం, మహదాస్యం గోపి, బాధ శ్రీనివాస్‌, పద్మ శేఖర్‌, సూరాబత్తుల తిరుపతి, రాణి, రమ, ఖాదర్‌, మౌనికరెడ్డి, సూర్యారావు, బాధ గణేష్‌, సతీష్‌, భీమారెడ్డి, భీమా సన్యాసిరావు, కనకారావు, నర్సయ్య, మహిళా విభాగం నాయకురాలు శ్రీదేవి, కార్యకర్తలు, బూత్‌ కన్వీనర్లు, బూత్‌ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.


కార్యక్రమానికి హాజరైన 43వ వార్డు మహిళలు

హామీలు అమలు చేయలేకే మోసాలు


51వ వార్డు సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సూపర్‌సిక్స్‌తోపాటు 143 హామీలు అమలు చేయలేక, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేక ముఖ్యమంత్రి చంద్రబాబు డైవర్షన్‌ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు విమర్శించారు. 51వ వార్డు గాంధీనగర్‌ కమ్యూనిటీ హాల్‌లో కార్పొరేటర్‌ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన ‘బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ’ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. ఎన్నికల హామీల అమలుపై ప్రశ్నించే వారి గొంతునొక్కేలా కూటమి పాలకులు వ్యవహరిస్తూ ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తల మీద దాడి చేస్తున్నారన్నారు. ఆడబిడ్డ నిధి సంక్షేమ పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్నే అమ్మేయాలని టీడీపీ మంత్రి అచ్చెన్నాయుడు అనడం ఆశ్చర్యంగా ఉందన్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలకంటే ఎక్కువ సంక్షేమ పథకాలు అమలు చేసి చూపించారన్నారు. ప్రతి కార్యకర్త కూటమి నాయకుల మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని కె.కె.రాజు పిలుపునిచ్చారు. అనంతరం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ పోస్టర్లు ఆవిష్కరించారు. పార్టీ వార్డు నాయకులు పైడి శ్రీను, బుడుమూరు తిరుమలరావు, పైడి ప్రతాప్‌, దమయంతి, నూకరాజు, తాడిపూడి రత్నం, వరలక్ష్మి, ధర్మవతి, రాణి, మిడతడ సూర్యనారాయణ, దామోదర్‌ సూర్యనారాయణ, అప్పారావు, అప్పలరాజు, వెంకటరమణ, కె.వి.రాజు, శేషు, పైడిరాజు, సాధు, చిన్ని, భాను, గణేష్‌, భాస్కర్‌, సాయి కుమార్‌, జగదీష్‌, సీనియర్‌ నాయకులు యర్రంశెట్టి శ్రీను, పద్మ శేఖర్‌, సీపాన రాము, కార్యకర్తలు, బూత్‌ కన్వీనర్లు, సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులకు బేబీ కిట్ల పంపిణీ


బేబీ కిట్లు అందుకున్న గర్భిణులతో రోటరీ క్లబ్‌ సభ్యులు

కంచరపాలెం: రోటరీ క్లబ్‌ ఆఫ్‌ విశాఖ మెట్రో ఆధ్వర్యంలో మాతా, శిశు ఆరోగ్య మాసం సందర్భంగా గురువారం కప్పరాడ అర్బన్‌ ప్రైమరీ హెల్త్‌ సెంటర్‌లో గర్భిణులకు బేబీ కిట్లు, పండ్లు పంపిణీ చేశారు. క్లబ్‌ అధ్యక్షుడు డాక్టర్‌ కూటికుప్పల రవికిరణ్‌ ప్రసాద్‌ మాట్లాడుతూ మహిళలకు శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ప్రతి ఏడాది రోటరీ ఇంటర్నేషనల్‌ మాతా శిశు ఆరోగ్య మాసంగా పాటిస్తుందని తెలిపారు. సమాజంపై రోటరీ కలిగిన బాధ్యతను ప్రతిబింబిస్తోందన్నారు. సంస్థ సేవా కార్యక్రమాలపై ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్‌ కార్యదర్శి పి.బి.రెడ్డి, శీల, సునిత లావణ్య మెడికల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ కిరణ్‌కుమార్‌, హరిథా, గైనకాలజీ డాక్టర్‌ పి.శిరీష, డాక్టర్‌ సుష్మిత, డాక్టర్‌ గంగాధర్‌ తదితరులు పాల్గొన్నారు.

విజువల్‌ పోలీసింగ్‌తో ప్రజలకు భద్రత


కప్పరాడ జంక్షన్‌లో విజువల్‌ పోలీసింగ్‌ నిర్వహిస్తున్న సీఐ రవికుమార్‌

మద్రిపాలెం: నగర పోలీస్‌ కమిషనర్‌ శంఖబ్రత బగ్చి ఆదేశాల మేరకు ప్రజలకు భద్రతతోపాటు గంజాయి, మాదకద్రవ్యాలు వంటి నేరాల నియంత్రణపై గురువారం కంచరపాలెం ఐదో పట్టణ సీఐ రవికుమార్‌ విజువల్‌ పోలీసింగ్‌ నిర్వహించారు. కప్పరాడ జంక్షన్‌లో సిబ్బందితో కలిసి విధులు నిర్వహించారు. అక్కడి వచ్చి వెళ్లే వారితో ఆయన మాట్లాడుతూ నేరాలు, ప్రమాదాలపై తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలు సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ తరహాలోనే విజువల్‌ పోలీసింగ్‌ ద్వారా నేరాలను పూర్తిస్థాయిలో అరికట్టవచ్చని సీఐ అన్నారు. నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల కట్టడికి విజువల్‌ పోలీసింగ్‌ను మరింత కట్టుదిట్టంగా అమలు చేస్తామని చెప్పారు.

‘పొదుపు పద్య శతకం’ పుస్తకావిష్కరణ


మాట్లాడుతున్న డాక్టర్‌ బేతవోలు రామబ్రహ్మం

సీతంపేట: సాహిత్య సురభి సంస్థ ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్‌ పౌర గ్రంథాలయంలో ఆచార్య పేరి సర్వేశ్వర అవధాని, ఆచార్య బి.ఎస్‌.కె.సుందర శివరావు రచించిన పొదుపు పద్య శతకం పుస్తకావిష్కరణ జరిగింది. వృద్ధుల కల్యాణ రామారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో డాక్టర్‌ బేతవోలు రామబ్రహ్మం చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్యాల్లో మూడో పాదంలో కీలకాంశం నిక్షేపించారని, రచయిత కృషి యువతరాన్ని ఆకట్టుకునేలా ఉందన్నారు. డాక్టర్‌ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ ఈ గ్రంథం పద్యబద్ధమైన సామాన్య భాషా పరిజ్ఞానం గల వారికి కూడా ఎంతో ఉత్సుకత కలిగిస్తూ చదివిస్తుందన్నారు. ఓరుగంటి రాజరాజేశ్వరి ప్రసాద్‌ పద్యాలను చదివి విశ్లేషణ చేశారు. కార్యక్రమంలో ఆచార్య కె.వి.రావు, సరవన్న, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.